www.prajasakti.com
ప్రజాశక్తి
5
బుధవారం 20 మార్చి 2024





తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సుమ కనకాల కుటుంబం

అజెండా.. పక్కా లోకల్..

- అభ్యర్థిని మార్చకుంటే ఓటమి తప్పదు..
- టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అసంతృప్తి
- పవన్ కళ్యాణ్, చంద్రబాబులను కలవనున్న నాయకులు
- పరిస్థితిని గమనిస్తున్న బిజెపి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు వద్దని ఆయనకు టికెట్ ఇస్తే తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి ఓడిపోవడం తథ్యమని, స్థానిక అభ్యర్థికి ఎమ్మెల్యే టికెట్ ఇస్తే తిరుపతి ఎమ్మెల్యే సీటు గెలుచుకుంటామని తిరుపతి టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ బాహాటంగా తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. మంగళవారం ప్రైవేట్ హోటల్లో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తిరుపతి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. అభ్యర్థి ప్రకటించిన వారం రోజుల తర్వాత సుగుణమ్మ కార్యకర్తలు నాయకులతో సుదీర్ఘంగా సమావేశం అయ్యారు. తిరుపతి ఎమ్మెల్యే టికెట్‌ను సుగుణమ్మ ఆశించారు. అయితే పొత్తులో భాగంగా టిడిపి అధిష్టానం జనసేనకు అసెంబ్లీ సీటు కేటాయించింది. సుగుణమ్మ ఎమ్మెల్యే టికెట్ కోసం చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో లోకల్.. నాన్ లోకల్ గొడవలు తిరుపతిలో మొదలయ్యాయి.

చిత్తూరు ఎమ్మెల్యేగా ఉన్న ఆరణి శ్రీనివాసులుకి తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎలా టికెట్ ఇస్తారని, ఎన్నికల ప్రచారంలో ఓటర్లకు ఎలా సద్ది చెప్పాలని వారు ప్రశ్నించారు. ఆరనికి టికెట్ ఇవ్వవద్దని, స్థానికులకే ఇవ్వాలని కోరుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును కలిసి నచ్చచెబుతామని అన్నారు. వారు విని అభ్యర్థిని మార్చి స్థానికులకు ఇస్తే అసెంబ్లీ అభ్యర్థిని గెలిపించుకుంటామని, లేదని ఆరణి శ్రీనివాసులుకే టికెట్ ఇస్తే ఆయన ఓడిపోవడం తథ్యమని అంటున్నారు. అధిష్టానం తిరుపతి పరిస్థితిని గమనించాలని లేదంటే తదుపరి కార్యక్రమం ప్రకటించాల్సి వస్తుందని సుగుణమ్మ నాయకులు కార్యకర్తలకు చెప్పారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

గత ఐదు సంవత్సర కాలంలో వైసిపి పాలనలో ప్రజలు విసిగిపోయారని వైసిపి ఆగడాలను ఎప్పటికప్పుడు టిడిపి, జనసేన కార్యకర్తలు అడ్డుకోవడం జరిగిందని గుర్తు చేశారు. టిడిపి, జనసేన పార్టీలో చాలామంది కార్యకర్తలు జెండాలు మోసి వైసీపీ పాలనలో దాడులు గురై అరెస్టై జైలుకు వెళ్లిన సందర్భాలూ ఉన్నాయన్నారు. అటువంటిది స్థానికులకు ఎమ్మెల్యే టికెట్ ఆవ్వకుండా వైసిపి ఎమ్మెల్యేగా ఉన్న ఆరణి శ్రీనివాసులు ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తే ప్రజలల్లోకి వెళ్లి ఏమని ప్రచారం చేయాలని ప్రశ్నిస్తున్నారు.

ఇది ఇలా ఉండగా తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు తిరుపతిలో ప్రచారం మొదలుపెట్టి ఇంటింటికీ తిరగడం విశేషం. ఈ కార్యక్రమానికి టిడిపి, జనసేన నుంచి వేర్వేరు గ్రూపుల్లో నేతలు కలవడం జరిగింది.

జనసేనలోనూ అసంతృప్తి..

తిరుపతి ఎమ్మెల్యే జనసేన అభ్యర్థిగా ఆరణి శ్రీనివాసులు స్థానికుడు కాదంటూ జనసేన చెందిన ఓ వర్గం కిరణ్ రాయల్, రాజారెడ్డి సంబంధించిన వర్గీయులు ఆరణి శ్రీనివాసులు ఇంతవరకు కలవలేదు. ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు అని ప్రచారం చేపట్టినప్పటికీ ఈ వర్గం దూరంగానే ఉంటున్నారు. జనసేన పార్టీకి చెందిన డాక్టర్ హరిప్రసాద్ మాత్రమే ఆరణి శ్రీనివాసులతో ప్రచారంలో పాల్గొంటున్నారు మిగతావారు కూడా కలవడం లేదు. జనసేన పార్టీ పరిశీలకులు వచ్చి నచ్చచెప్పినా కిరణ్ రాయల్ ససేమిరా అన్నట్టు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.. ఈవిషయం పవన్ కళ్యాణ్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటానని కిరణ్ రాయల్ పార్టీ పరిశీలకు చెప్పినట్టు సమాచారం.

నరసింహ యాదవ్ అలిగారా...?

తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు పేరు ప్రకటించినప్పటి నుంచి టిడిపి తిరుపతి పార్లమెంటు ఇన్‌ఛార్జి నరసింహ యాదవ్ పార్టీ కార్యక్రమాలకు గత పదిరోజుల నుంచి దూరంగా ఉంటున్నారు. జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఇంతవరకు కలవకపోవడం, తిరుపతి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా నరసింహ యాదవ్ కూడా ఆఖరి వరకు ప్రయత్నాలు చేసి విఫలమైనారు. పొత్తులో భాగంగా తిరుపతి సీటు జనసేన ఇవ్వడం పట్ల టిడిపి నేతలు క్యాడర్లో వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. నరసింహ యాదవ్ పార్టీ తీరు పట్ల అలిగారా లేదా పార్టీకి దూరంగా ఉంటున్నారా తెలియాల్సి ఉంది.

మాకేం సంబంధం బీజేపీ..

తిరుపతి అసెంబ్లీ టికెట్ విషయంలో లోకల్.. నాన్ లోకల్ గొడవ ఒకపక్క జరుగుతుంటే బిజెపి మాత్రం తమకేమీ సంబంధం లేనట్టు వ్యవహరిస్తోంది. తిరుపతి అసెంబ్లీ టికెట్ జనసేనకు ఇవ్వడం జరిగింది. అది ఆ పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయం అని తమకేమీ సంబంధం లేదని, తమ పార్టీ ఎంపీ అభ్యర్థిగా తిరుపతి నుంచి పోటీచేసే అవకాశాలు ఉన్నాయని, ఆ పనిలో తాము నిమగ్నమై ఉన్నామని బిజెపి నేతలు అంటున్నారు. ఏది ఏమైనా టిడిపి, జనసేన లోకల్ నాన్‌లోకల్ అభ్యర్థులంటూ రచ్చ చేస్తుంటే బిజెపి మాత్రం ప్రశాంతంగా వేడుక చూస్తోంది..

టిడిపికి భారీ షాక్..!

- కాంగ్రెస్ గూటికి 'పోతుగుంట'
- ఎమ్మెల్యే అభ్యర్థిగా శ్రీకాళహస్తి నుంచి పోటీ



ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎన్నికల బరిలో దూసుకుపోతున్న టిడిపికి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నేత, ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ పోతుగుంట గురవయ్య నాయుడు తనయుడు డాక్టర్ పోతుగుంట రాజేష్ నాయుడు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, రాష్ట్ర ఉపాధ్యక్షులు తులసీ రెడ్డి సమక్షంలో పోతుగుంట రాజేష్ నాయుడు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం జరిగింది. రాజేష్ నాయుడు ప్రముఖ వైద్యుడిగా, వ్యాపారవేత్తగా ఉన్నాగానీ, తండ్రి ఆశయాలు, రాజకీయంపై ఉన్న మక్కువతో గత రెండేళ్లుగా శ్రీకాళహస్తిలో మకాం వేసి సేవా కార్యక్రమాల్లో మునిగితేలుతున్నారు. ఈ క్రమంలోనే ఆయన శ్రీకాళహస్తి నుంచి టిడిపి టిక్కెట్టు గట్టిగానే ఆశించారు. టిడిపి నుంచి ఆ పార్టీ ఇంచార్జ్ బొజ్జల సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవి నాయుడు నుంచి గట్టి పోటీనే ఉంది. ఈ క్రమంలో తనకే టిక్కెట్టు కావాలని ఢిల్లీ స్థాయిలో రాజేష్ నాయుడు మంతనాలు జరిపారు. తీరా కూటమి పొత్తులో భాగంగా శ్రీకాళహస్తి టికెట్టు బొజ్జల సుధీర్ రెడ్డికి దక్కడంతో రాజేష్ నాయుడు కోరిక ఫలించలేదు. యువకుడిగా, తండ్రికి తగ్గ తనయుడిగా మార్పు కోరుకుంటున్న రాజేష్ నాయుడు చివరకు కాంగ్రెస్ పార్టీ తరఫున శ్రీకాళహస్తి నుంచి పోటీ చేసేందుకు సిద్ధమవుతుండడం గమనార్హం. రాజేష్ నాయుడు కాంగ్రెస్ పార్టీలో చేరిక శ్రీకాళహస్తిలో సంచలనమే కానుంది. ఆయనకు తొట్టంబేడు మండలంతో పాటు శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాల్లో కూడా కమ్మ సామాజిక వర్గంలో మంచి పట్టు ఉంది. గత రెండేళ్లుగా సేవా కార్యక్రమాలు చేపడుతూ అన్ని సామాజిక వర్గాల ప్రజలకు కూడా దగ్గరయ్యారు. టిడిపి సీనియర్ నేతగా ఉన్న రాజేష్ నాయుడు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో టిడిపి వర్గాలను కలవర పెడుతుందని చెప్పుకోవాలి. ఆయన రానున్న ఎన్నికల్లో గెలిచినా, గెలవకపోయినా ప్రత్యామ్నాయ రాజకీయాలతో పాటు, మార్పు కోసం పాటుపడ్డ వ్యక్తిగా నిలిచిపోతారు.

సార్వత్రిక ఎన్నికల నోడల్ అధికారుల

విధులను సమర్థవంతంగా నిర్వహించాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ, తిరుపతి టౌన్: సార్వత్రిక ఎన్నికలు- 2024కు షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో నోడల్ ఆఫీసర్లు వారికి కేటాయించిన విధులపై పూర్తి అవగాహన కలిగి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో సార్వత్రిక ఎన్నికలు- 2024 నిర్వహణ విధులు కేటాయించబడిన నోడల్ అధికారులతో ఎన్నికల సన్నద్ధతపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో నోడల్ ఆఫీసర్లు వారికి కేటాయించిన విధులపై ఒక పక్కా ప్రణాళికతో అవగాహన కలిగి సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఇందుకొరకు వారికి కేటాయించిన సంబంధిత అంశంపై పీపీటి తయారీతో ఏర్పాట్లు సన్నద్ధతగా ఉండాలని ఆదేశించారు. ఎన్నికల విధులకు కావలసిన సిబ్బంది కేటాయింపు మ్యాన్ పవర్ నోడల్ అధికారి, ట్రైనింగ్ నోడల్ అధికారి ఇంతవరకు ఇచ్చిన వాటిపై నివేదిక , మెటీరియల్, ట్రాన్స్ పోర్ట్, సైబర్ సెక్యూరిటీ, స్వీప్, లాఅండ్ ఆర్డర్, ఈవిఎం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఎక్స్పెండిచర్, బ్యాలెట్ పేపర్స్, పోస్టల్ బ్యాలెట్, మీడియా, కమ్యూనికేషన్ ప్లాన్, ఎలెక్టోరల్ రోల్స్, ఓటరు హెల్ప్ లైన్, అబ్జర్వర్స్, మీడియా, సక్షం నోడల్ అధికారి తదితర విభాగాలలో నోడల్ ఆఫీసర్లుగా విధులు కేటాయించబడిన అధికారులందరూ ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొంటూ ఎన్నికల విధుల నిర్వహణ బాధ్యతగా అప్రమత్తంగా నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహణలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల హ్యాండ్ బుక్ మేరకు పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల విధులను అంకిత భావంతో బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ పెంచల కిషోర్, ఎన్నికల విధులు కేటాయించబడిన వివిధ నోడల్ ఆఫీసర్లు, ఎలక్షన్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లే 'టార్గెట్'

- లక్ష్యాల పేరిట తొలగింపు
- వేతనాల్లోనూ కోత
- ఎగవేత వేతనాలతో ఉన్నతాధికారుల విలాసాలు!
- కుంటుపడుతున్న 'ఉపాధి హామీ' లక్ష్యం



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు ఫైల్ ఫొటో

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి

ప్రతి నిరుపేద కుటుంబానికి చేతినిండా పని.. మూడు పూటలా తిండి పెట్టడమే లక్ష్యంగా 2005లో ఉపాధి హామీ పథకం చట్టం చేసుకుంది.. 2006 ఫిబ్రవరి 2వ తేదీన లాంఛనంగా దేశంలోనే మొదటి పైలెట్ ప్రాజెక్టు కింద ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధి హామీ పథకం ప్రారంభమైంది.. పథకం ప్రారంభమై దాదాపు 20 ఏళ్లు పూర్తి కావస్తున్నా ఎక్కడా నిరాదరణకు గురికాని పరిస్థితి ఉంది. ముఖ్యంగా ప్రతి నిరుపేద కుటుంబం ఉపాధి పనులకెళ్లి పొట్టపోసుకుంటున్నారు. ఏడాదికి 100 రోజులు కాదు 200 రోజుల పని కావాలన్న డిమాండ్లు పేదల నుంచి అధికమవుతున్నాయి. ఇంతలా పేదల ఆదరణ పొందిన 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం'ను క్షేత్ర స్థాయిలో నడుపుతున్న రథసారథులు మాత్రం ఫీల్డు అసిస్టెంట్లే అని చెప్పక తప్పదు. ఏసీ గదుల్లో కూర్చుని డ్వామా అధికారులు టార్గెట్లు నిర్దేశించినా కూలీలతో సమానంగా ఎండనక.. వాననక క్షేత్రస్థాయిలో పనులు చేయిస్తోంది.. చేస్తోంది మాత్రం క్షేత్ర సహాయకులే. ఇంతలా ఉపాధి పథకం నిరుపేదల దరిచేరేలా కృషి చేస్తున్న ఫీల్డు అసిస్టెంట్లు పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరమనే చెప్పాలి. వారి చేత గొడ్డు చాకిరీ చేయించుకుంటూ తీరా లక్ష్యాల పేరి నిర్దాక్షిణ్యంగా తొలగించేస్తున్న పరిస్థితి. కొంతమందిని హోల్డ్‌లో పెట్టి వేతనాలు ఎగ్గొట్టుతున్న వైనం. తొలగించిన ఫీల్డు అసిస్టెంట్లను తిరిగి విధుల్లోకి చేర్చుకోవాలంటే పాత 'బకాయి అడగను' అని ఒప్పంద పత్రం రాయించుకుంటున్న పరిస్థితి తిరుపతి జిల్లాలో కనిపిస్తోంది. 'ఒక పక్క నిరుద్యోగం..ఇంకో పక్క కుటుంబ పోషణ' వెరసి ఫీల్డు అసిస్టెంట్లు వేతనాలు ఇచ్చినా ఇవ్వకపోయినా పాత బకాయి అడగమంటూ ఒప్పంద పత్రం రాసి తీరా విధుల్లోకి చేరుతున్న దుస్థితి కనిపిస్తోంది. ఈ క్రమంలోనే వేతనాలు లేక కొంతమంది ఫీల్డు అసిస్టెంట్లు అడ్డదారులు తొక్కుతున్నారనీ, ఫలితంగా 'ఉపాధి హామీ' లక్ష్యం పక్కదారి పడుతోందన్న విమర్శలు వస్తున్నాయి.

లక్ష్యాల పేరిట తొలగింపు

తిరుపతి జిల్లా వ్యాప్తంగా సుమారు 830 మంది ఫీల్డు అసిసెంట్లు పనిచేస్తున్నారు. పథకం ప్రారంభం నుంచి 2014 వరకు పని చేసిన వారిని ఫిక్స్‌డ్ టెన్యూర్ అసిస్టెంట్లు (రూ.10 వేలు జీతం), 2014 పైబడి పని చేసేవారిని ఫీల్డు అసిస్టెంట్లు (రూ.8 వేలు), కొత్తగా చేరుతున్న వారిని సీనియర్ మేట్ (రూ.6వేలు)లుగా గుర్తించి డ్వామా అధికారులు ఉపాధి పథకాన్ని ముందుకు నడుపుతున్నారు. అయితే ఫీల్డు అసిస్టెంట్లను మూడు విభాగాలుగా విభజించినా కూడా వీరంతా ఏడాది 7500 పనిదినాలు ఉపాధి కూలీలకు కల్పించి ఉంటేనే వేతనానికి అర్హులు. మరో ఏడాది కూడా ఫీల్డు అసిస్టెంట్‌గా కొనసాగే అవకాశం ఉంటుంది. లేకుంటే నిర్దాక్షిణ్యంగా తొలగించేస్తున్న పరిస్థితి. ఈనేపథ్యంలో ఉపాధి హామీ టార్గెట్లు చేరుకునేందుకు ఫీల్డు అసిస్టెంట్లు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. అవకాశం లేని చోట లక్ష్యాలు చేరేందుకు అపసోపాలు పడుతూ తీరా ప్రాణం పైకి తెచ్చుకుంటున్నారు. కొందరైతే లక్ష్యానికి చేరువై చివర్లో భంగపడి వేతనాలు, ఉద్యోగాలు కూడా పోగొట్టుకుంటున్న పరిస్థితి కనపడుతోంది. గడిచిన రెండేళ్ల కాలంలో తిరుపతి జిల్లా వ్యాప్తంగా సుమారు 200 మంది ఫీల్డు అసిస్టెంట్లను టార్గెట్ల పేరిట తొలగించినట్లు సమాచారం. ఇదంతా ఏడాదికి రూ.4వేల కోట్ల మేర కేంద్ర ఇస్తున్న ప్రోత్సాహక నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేయిస్తున్న పనిదోపిడీగా ఫీల్లు అసిస్టెంట్లు ఆరోపిస్తున్నారు. తమ చేత ఏడాదికి రూ.10వేల కోట్ల మేర పనులు చేయించి తద్వారా కేంద్రం ద్వారా రూ.4వేల కోట్లు మెటీరియల్ నిధులు తెప్పించుకుని వాటిని ఉపాధి హామీ యేతర పనులకు మళ్లిస్తున్నారని ఫీల్డు అసిస్టెంట్లు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

ఎగవేత వేతనాలతో ఉన్నతాధికారుల విలాసాలు!

గతంలో ఉపాధి హామీ పథకం కూలీల వేతనాల కోసం టాటా కన్సెల్టెన్సీ సెర్వీసు ద్వారా కార్యకలాపాలు సాగాయి. ఇది రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో పనిచేస్తుండటంతో నిధులు దారి మళ్లుతున్నాయంటూ కేంద్రం దాన్ని నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్‌కు అప్పజెప్పింది. అయినా కూలీలు వేతనాల చెల్లింపులో గానీ, ఇతరేతర పనుల్లో గానీ పారదర్శకత కనిపించిన పరిస్థితి. ఇకపోతే సాఫ్ట్‌వేర్ అప్డేషన్ల కోసం బ్లూఫ్రాగ్ అనే కంపెనీకి కోట్లు ధారపోస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇక ఫీల్డు అసిస్టెంట్ల అంశానికి వస్తే డ్వామా పీడీ లాగిన్‌లోని అడ్మిన్ కాస్ట్ ద్వారా వేతనాలు చెల్లిస్తున్నారు. అయితే ఏడాదికి 7500 పనిదినాలు చేరుకోలేని ఫీల్డు అసిస్టెంట్లను తొలగిస్తున్న వారికివ్వాల్సిన వేతనాలను అడ్మిన్‌కాస్ట్ లాగిన్‌లో అలానే ఉంచుతున్నట్లు సమాచారం. ఒక వేళ తొలగించిన ఫీల్డు అసిస్టెంట్ తిరిగి విధుల్లోకి రీ జాయిన్ కావాలంటే 'నేను పాత బకాయిని అడగను' అని ఒప్పందం చేసుకోవాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో సుమారు 250 మంది ఫీల్డు అసిస్టెంట్లకు వేతనాలు నిలిపేసినట్లు సమాచారం. కొందరికి ఏడాది కాలంగా, మరికొందరికి ఆర్నెల్లుగా, ఇంకొందరికి మూడు నెలలుగా వేతనాలు చెల్లించలేదని ఫీల్డు అసిస్టెంట్లు వాపోతున్నారు. ఇలా ఫీల్డు అసిస్టెంట్లకు వేతనాల రూపంలో ఎగ్గొట్టిన సొమ్మును ఉన్నతాధికారులు అడ్మిన్ కాస్ట్ ద్వారా కార్లు కొనుగోలు, అలవెన్సులు, మెయింటినెన్సులు, సాఫ్ట్‌వేర్ అప్డేడ్ల కోసం వినియోగిస్తున్నట్లు తెలిసింది. 'సొమ్మొకరిది..సోకరిది' అన్న రీతిలో డ్వామా అధికారులు వ్యవహరిస్తుండటంతో జిల్లాలో ఫీల్డు అసిస్టెంట్ల పరిస్థితి అగమ్యచోరంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగానూ ఇదే పరిస్థితి నెలకొందని చెప్పుకుంటున్నారు. ఇకనైనా సంబంధిత ఉపాధి హామీ పథకం ఉన్నతాధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పథకాన్ని ముందుండి నడిపిస్తున్న క్షేత్ర సహాయకులకు అండగా నిలబడాల్సిన అవసరం ఉంది. ఉపాధి హామీ పథకం లక్ష్యాన్ని కాపాడాల్సిన ఆవశ్యకతా చాలా ఉంది.

వెంటనే వేతనాలు చెల్లించాలి

- పెనగడం గురవయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి



తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఫీల్డు అసిస్టెంట్లకు వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలి. లక్ష్యాల పేరిట తొలగించిన ఫీల్డు అసిస్టెంట్లను ఎలాంటి ఆంక్షలు లేకుండా తిరిగి విధుల్లోకి తీసుకోవాలి. ఎగవేసిన ఫీల్డు అసిస్టెంట్ల వేతనాలను అడ్మిన్ కాస్ట్ ద్వారా విలాసాలకు వాడుకోవడం బాధాకరం. ఫీల్డు అసిస్టెంట్ల పట్ల డ్వామా అధికారులు, ప్రభుత్వ వైఖరి మారకుంటే సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతాం.

టీడీపీలో గందరగోళం..!

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

సత్యవేడు నియోజకవర్గ స్థాయిలో అభిప్రాయసేకరణ లేకుండా అధిష్టానం తీసుకున్న నిర్ణయంపై క్యాడర్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. అనూహ్యంగా వైసీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకి టికెట్ కేటాయించడాన్ని క్యాడర్ జీర్ణించుకోలేకపోయింది. నమ్ముకున్న పార్టీకి పని చెయ్యాలా లేక వైసీపీ ప్రభుత్వంలో తమను ఇబ్బంది పెట్టిన కోనేటికి పనిచేయకుండా మిన్నకుండలా...అనే మిమాంసలో టీడీపీ క్యాడర్ ఉంది.



టిడిపి కేడర్‌ను కలుపుకుపోయే పనిలో ఆదిమూలం

జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గానికి సంబంధించి టిడిపి అధిష్టానం తమను సంప్రదించకుండానే సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసిపి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకి టికెట్ కేటాయించడంపై నియోజకవర్గ స్థాయిలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర స్థాయిలో తమ అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

అభ్యర్థి మార్పుకి కారణాలేమిటి...!

సత్యవేడు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిని అనూహ్యంగా మార్చడానికి గల కారణాలపై చాలా వాదనలే వినిపిస్తున్నాయి..! నాలుగున్నర సంవత్సరాలలో ఇద్దరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆశావహులు ప్రభుత్వ విధానాలను ఎండగట్టడంలో, ప్రజలను, పార్టీ నాయకులను, కార్యకర్తలును కలుపుకు పోవడంలో విఫలం కావడమే కారణమా..? ప్రస్తుత ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తన టికెట్ కేటాయింపుపై వైసీపీ అధిష్టానం ససేమిరా అనడంతో జిల్లాలో వైసీపీ పెద్దాయనగా పిలుచుకునే సాక్షాత్తు పెద్దిరెడ్డి పైనే ఆయన వ్యక్తిగత దూషణలతో అప్పటివరకు ఆదిమూలం వెనకాల ఉన్న నాయకులే ముందు ఉండి ఆయన దిష్టిబొమ్మ తగల పెట్టడంతో వచ్చిన సింపతీని హైప్ చేసుకుని, బలమైన లాబీయింగ్ వల్ల క్యాస్ట్ ఈక్వేషన్ సాకుతో అభ్యర్థి మార్పు జరిగినట్లు బలమైన వాదన ఉంది...?

వడివడిగా ఆదిమూలం అడుగులు..

ఆఖరి నిమిషంలో టీడీపీలో టికెట్ తెచ్చుకున్న ప్రస్తుత వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, టీడీపీ నాయకులను, కార్యకర్తల మద్దతు కోసం ప్రసన్నం చేసుకునే పనిలో భాగంగా అటు టీడీపీ సీనియర్ నాయకులను కలుస్తూ ఇటు సోషల్ మీడియా ద్వారా ఆయన్ని విభేదిస్తున్న వారిని ఎప్పటికప్పుడు కలుస్తూ తనపై ఉన్న వ్యతిరేకతను తగ్గించుకునే ప్రయత్నంలో వడివడిగా అడుగులు వేస్తున్నారనే చెప్పాలి...

భిన్నఅభిప్రాయలతో అయోమయంలో కార్యకర్తలు

కోనేటి ఆదిమూలంకి టికెట్ కేటాయింపుపై అధిష్టానం మీద కొంతమంది నాయకులు, కార్యకర్తలు బహిరంగానే విభేధిస్తుంటే... మరి కొంతమంది నాయకులు పార్టీ నిర్ణయమే శిరోధార్యం అంటూ, పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చిన కష్టపడి గెలిపించుకుంటాం అంటున్నారు. కోనేటి ఆదిమూలంపై తమకు వ్యక్తిగత అభిప్రాయ బేధాలు లేనప్పటికి ఆయన అధికారపార్టీ ఎమ్మెల్యేగా ఉన్నపుడు నియోజకవర్గ వ్యాప్తంగా ఆయన పేరు చెప్పి ఆయా మండలాల్లో స్థానిక వైసీపీ నాయకులు... తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై కక్షసాదింపు చర్యలు చేపట్టారని అలాంటి వ్యకిని ఇప్పుడు భుజాలమీద మోయలేమని, జరిగిన పరిణామాలను అధిష్టానంకి వివరించి చివరి నిమిషం వరకు అభ్యర్థి మార్పు కోసం పోరాడుతామని, లేనిపక్షంలో స్పష్టమైన హామీ పొందిన తర్వాతే అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామని ఒక వర్గం తేల్చి చెబుతున్నారు.

ఊహించని వ్యతిరేకత..

అభ్యర్థిని మార్చడంతో ఊహించని రీతిలో వచ్చిన వ్యక్తిరేకతతో అధిష్టానం రీ సర్వే చేయబోతుందన్న వార్త చెక్కర్లు కొడుతున్నప్పటికీ... ఆది నుండి టీడీపీకి కంచుకోటగా ఉన్న సత్యవేడు నియోజకవర్గానికి సంబంధించిన ఈసారి ఎన్నికలను ప్రతిష్టాకత్మంగానే తీసుకున్నప్పటికీ అభ్యర్థి మార్పుతో వస్తున్న వ్యతిరేకతను తగ్గిస్తూ బలమైన నాయకత్వంతో సత్యవేడు గడ్డపై తిరిగి టీడీపీ జెండా ఎగరావేయడానికి అధిష్టానం గట్టిగానే వ్యూహరచన చేస్తున్నట్టు సమాచారం..?

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

ప్రభుత్వ కాంటాక్ట్ ఉద్యోగులపై వేటు

ప్రజాశక్తి- గుడిపల్లి: ఎన్‌ఆర్‌ఈజీఎస్ గుడిపల్లి ఫీల్డ్ అసిస్టెంట్, కుప్పం టెక్నికల్ అసిస్టెంట్లను విధుల నుండి తొలగిస్తూ చిత్తూరు జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా ఉంటూ ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన కారణంగా చిత్తూరు జిల్లా గుడిపల్లి మండలం చీకటపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.వెంకటేష్, కుప్పం మండలం టెక్నికల్ అసిస్టెంట్ జి.మురగేష్‌లను విధుల నుండి పూర్తిగా తొలగిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

గుడిపల్లి మండలం చీకటిపల్లి గ్రామపచాయతీకి చెందిన ఎం.వెంకటేష్ మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇతను వైసిపి పార్టీ కార్యకలాపాల్లో ప్రచారంలో యథేచ్ఛగా పాల్గొనడంతో అతనిపై కలెక్టర్‌కు ఫిర్యాదులు అందడంతో విధుల నుండి పూర్తిగా తొలగిస్తున్నట్లు ఉపాధి హామీ కార్యాలయానికి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే రామకుప్పం మండలానికి చెందిన మురుగేశ్ కుప్పం మండలంలో టీఏగా పనిచేస్తున్నారు. అతను డిప్యూటేషన్పై వైసిపి ఎమ్మెల్సీ భరత్ పీఏగా పనిచేస్తున్నారు. కుప్పం రెవెన్యూ కార్యాలయంలో సోమవారం అఖిలపక్ష నాయకులతో ఆర్వో, ఆర్డీవో శ్రీనివాసులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా టిడిపి, బిజెపి, కాంగ్రెస్, జనసేన తరపున నాయకులు పాల్గొనగా.. అధికార వైసిపి తరపున ఎమ్మెల్సీ పీఏ మురుగేశ్ పాల్గొనడంపై విమర్శలు వస్తున్నాయి. దీనిపై ప్రతిపక్షాలు ఆర్వోకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకు గాను మురగేష్‌ను విధుల నుండి పూర్తిగా తొలగిస్తున్నట్లు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

టపాసుల గొడౌన్‌లో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: సూళ్లూరుపేటలోని హోలీ క్రాస్ సర్కిల్ సమీపంలో మదీనా టపాసుల గొడౌన్ లో మంగళవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఐదుగురు తయారీ కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. తీవ్రంగా గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎలాంటి సేఫ్టీ ప్రికాషన్స్ లేకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు అంటున్నారు.

కుక్కల దాడిలో చుక్కల జింక మృతి

ప్రజాశక్తి -రామచంద్రాపురం: కుక్కల దాడిలో ఓ జింక మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని రాయల చెరువు పేట అటవీ ప్రాంతంలో వేట కుక్కల దాడిలో చుక్కల జింక తీవ్రంగా గాయపడింది. మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో వేట కుక్కలు అటవీ ప్రాంతంలోని జింక వెంటబడి తరుముకున్నాయి. వేట కుక్కల దాడి నుంచి తప్పించుకునేందుకు అటవీ ప్రాంతం నుంచి తిరుపతి పచ్చికాపలం రోడ్డుపైకి పరుగులు తీసి రోడ్డు పక్కన పడిపోయింది. అదే సమయంలో తిరుపతికి కారులో వస్తున్న ప్రతాప్ స్వామీజీ గుర్తించి కారును ఆపి చుక్కల జింకను కుక్కల దాడి నుండి కాపాడారు. జింక వెనుక కాళ్లకు తీవ్ర గాయమైంది. వెంటనే పశువైద్యాధికారిని సంఘటన స్థలానికి రప్పించి ప్రథమ చికిత్స చేయించారు. అటవీ శాఖ అధికారులు జింకను రక్షించేందుకు కృషి చేశారు. అయినా సాయంత్రం ఐదు గంటల సమయంలో జింక మృతి చెందింది. అనంతరం జింకను కార్వేటినగరం ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. అనంతరం పంచనామా చేసి చుక్కల జింకను కాల్చివేశారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ అరుణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గిట్టుబాటు కూలి కల్పించాలి: డ్వామా పీడీ

ప్రజాశక్తి - బాలాయపల్లి : ఉపాధి హామీ కూలీలకు గిట్టుబాటు కూలి కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ శ్రీనివాస్ ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని వెంగమాంబపురం గ్రామ పంచాయతీ మినీ అమృత్ సరోవర్ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడుతూ 'మీకు కూలి ఎంత గిట్టుబాటు అవుతుంది?' అని ఆరాతీశారు. అన్ని కుటుంబాలకు వంద రోజులు పనిదినాలు కల్పిస్తున్నారా? లేదా?' అని ప్రశ్నించారు. వంద రోజులు పనులు కల్పించక పోతే ఉపాధి సిబ్బందిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ పంచాయతీ స్థాయిలో సెవెన్ రిజిస్టర్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మృత్యుంజయరావు, ఏపీవో, కరుణాకర్ రెడ్డి, ఈసీ మస్తానమ్మ, శ్రీనివాసులు, వెంకటయ్య, కిరణ్, రమేష్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జగదాంబ మృతికి ఎమ్మెల్యే సంతాపం

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సమీప బంధువు, స్థానిక దిగవూరు పంచాయతీ మల్లీవారి పల్లికి చెందిన రిటైర్డ్ అధ్యాపకులు డి రాజారెడ్డి ఆయన సతీమణి డి జగదాంబ సోమవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. మృతురాలు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీకి వరుసకి మేనత్త కావడంతో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన తనయుడు మోహిత్ రెడ్డి జగదాంబ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ యుగంధర్ రెడ్డి, కన్వీనర్ కొండారెడ్డి, సర్పంచ్‌లు శంకర్ రెడ్డి, భూపాల్, మనోహర్, నాయకులు దేవప్రసాద్, భాస్కర్ రెడ్డి, ఇర్షాద్, సాదిక్, బావాజీ, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కృత్రిమ చేతులు పంపిణీని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరిలో ఈనెల19వ తేదీ నుండి 26వ తేదీ వరకు ఉచిత కృత్రిమ చేతులు అమర్చే కార్యక్రమాన్ని ప్రత్యేక ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ మయూరి శ్యామ్ యాదవ్ పేర్కొన్నారు. హెల్ప్ లైన్ నంబర్ 7207403150 నెంబర్ కి ఫోన్ చేసి మీ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేయాలి: కమిషనర్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని పుత్తూరు పురపాలక సంఘం కమిషనర్ పిలుపునిచ్చారు. ఓటు హక్కు పై అవగాహన సేప్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ. ఓటర్లు తమ హక్కును తప్పనిసరిగా పాటించాలని నిజమైన ప్రభుత్వాన్ని ఎంచుకొని ఓటు వేయాలని ఏ ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని సూచించారు. మొబైల్ యాప్ లేదా ఆన్లైను ద్వారా ఓటరు సేవను పొందవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరు ఓటు వేసేందుకు కొన్ని నిమిషాలు కేటాయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు సచివాలయ ఇబ్బందులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కబ్జా నుండి భూమిని కాపాడండి

ఆర్డీవోకు బాధితుల అభ్యర్థన



సిపిఎం ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న బాధితులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : 'భూ కబ్జాదారుల నుండి మా భూములను కాపాడండి..' అం టూ సిపిఎం ఆధ్వర్యంలో మండలం, కోట బేడు గ్రామస్తులు అభ్య ర్థించారు. గూడూరు పట్టణం లోని ఆర్డీవో కార్యాలయంలో సిపిఎం నాయకులతో కలిసి ఆర్డీవోకి వారు మంగళవారం అర్జీ ఇచ్చారు. ఈ సందర్భంగా గూడూరు సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ మాట్లాడుతూ 1979 వ సంవత్సరంలో ఎస్సీ, బీసీ లకు ప్రభుత్వం డికెటి పట్టాలు మంజూరు చేశారన్నారు. వీరి పేర్లను వెబ్ ల్యాండ్‌లోనూ నమోదు చేశారని, అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బలరామి రెడ్డి, ఈశ్వర్ రెడ్డి , రేవతి లు భూములను స్వాధీనం చేసుకున్నారన్నారు. 10 ఏళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇకనైనా ఆర్డీవో విచారించి ఎస్సీ, బీసీ భూములను పెత్తందారుల నుండి ఇప్పించాలని కోరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పాల్గొన్నారు.

వైసిపికి గట్టి ఎదురు దెబ్బ

- పంచాయతీ కన్వీనర్ బాబు నాయుడు రాజీనామా - నేడు టిడిపి తీర్థం



బాబునాయుడు

ప్రజాశక్తి - రామచంద్రాపురం : రామచంద్రాపురం మండలంలోని గణేశ్వర పురం పంచాయతీలో వైసిపికి గట్టి షాక్ తగిలింది. పంచాయతీ కన్వీనర్ కందల బాబునాయుడు మంగళవారం తన పదవితో పాటు వైసిపికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో ఇమడలేక పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం తన అనుచరులతో కలిసి చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు తనకు సహకరించిన ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి చంద్రగిరి నియో జక వర్గం ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షం లో బుధవారం తన అనుచరులతో కలిసి టిడిపి తీర్థం పుచ్చుకోనున్నట్లు ఆయన తెలిపారు.

అడిగోపుల అభ్యుదయ కవి రత్నం

- సాకం నాగరాజు



నిలువెత్తు సంతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: అడిగోపుల వెంకటరత్నం అభ్యుదయ కవి రత్నమని తెలుగు భాషోద్యమ సమితి వ్యవస్థాపకులు సాకం నాగరాజు కొనియాడారు. స్థానిక యశోద నగరంలోని వేమన విజ్ఞాన కేంద్రంలో తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత అడిగోపుల వెంకటరత్నం రచించిన నిలువెత్తు సంతకం పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ పద్మావతి డిగ్రీ కళాశాల తెలుగు శాఖ పూర్వ అధ్యక్షురాలు ప్రేమావతి ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఎస్వియు కళాశాల తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు మేడిపల్లి రవికుమార్ ఈ పుస్తకాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యంగా కనిపించే వస్తువులు కూడా జిగేల్‌మనిపించేలా అడిగోపుల రచన చేయగలరని కొని యాడారు. అడిగోపుల సామాజిక స్వాప్నికుడు, భవిష్య దార్శనికుడు, అడిగోపుల కవిత్వంలో దేశీయత, కవితాత్మ కథలు ప్రకాశిస్తాయన్నారు. ఆచార్యులు పిసి వెంకటేశ్వర్లు, సీనియర్ పాత్రికేయులు అమరేంద్ర మాట్లాడుతూ అడిగోపుల కవిత్వం అభ్యుదయమని సమ సమాజ నిర్మాణం కోరుతుందని తెలిపారు. ప్రజల్ని చైతన్య పరచటంలో ముందుం టుందని, ఆంధ్రదేశానికి అభ్యుదయ కవిత్వం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకాశవాణి మాజీ డైరెక్టర్ మల్లేశ్వరరావు, వేమన విజ్ఞాన కేంద్రం కన్వీనర్ మల్లారపు నాగార్జున, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

21న పిఓ, ఏపీఓలకు శిక్షణ

ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేపీ నరసింహులు

ప్రజాశక్తి- సత్యవేడు: పుత్తూరు సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 21వ తేదీ గురువారం ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు మొదటి విడత శిక్షణ నిర్వహించనున్నట్లు సత్యవేడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేపీ నరసింహులు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ శిక్షణలో భాగంగా గురువారం ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు 421 మంది పిఓ, ఏపీఓలకు శిక్షణ ఉంటుందన్నారు. నాగలాపురం, నారాయణవనం, సత్యవేడు మండలాలకు సంబంధించి పూర్తిగాను, పిచ్చాటూరు మండలానికి సంబంధించి 50 శాతం పిఓ, ఏపీఓలు ఉదయం శిక్షణకు హాజరు కావాల్సి ఉందన్నారు. మధ్యాహ్నం 2-30 గంటల నుంచి 5-30 గంటల వరకు నిర్వహించే శిక్షణకు 401 మంది హాజరు కావాలన్నారు. బుచ్చినాయుడు కండ్రిగ, కేవిబి పురం, వరదయ్యపాలెం మండలాల నుంచి పూర్తి గాను, పిచ్చాటూరు నుంచి మిగిలిన 50 శాతం మంది పిఓ, ఏపీఓలు శిక్షణ కోసం హాజరు కావాలని ఆయన కోరారు. ముఖ్యంగా పోలింగ్ సమయంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. ఈ సమాజంలో స్థానిక తహశీల్దారు, అసిస్టెంట్ ఎన్నికల అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

రూ.లక్ష ఆస్తి నష్టం



నిత్యావసర సరుకులు అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -రేణిగుంట: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధమైన సంఘటన రేణిగుంట పట్టణంలోని వేణుగోపాలపురం శివకుమార్ నగర్‌లోలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు లత రేకుల ఇంటిలో కుటుంబ సభ్యులతో కలసి వుంటోంది. కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మధ్యాహ్నం ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇంట్లో ఉన్న వస్తు సామగ్రి, బంగారం డబ్బులతో సహా సుమారు లక్ష రూపాయల మేర ఆస్తి నష్టం సంభవించిందని తెలిపారు. సమాచారం అందుకున్న రేణిగుంట సర్పంచ్ నగేషం, పట్టణాధ్యక్షుడు ప్రభాకర్, వైస్ ఎంపీపీ సుజాత, వార్డు మెంబర్లు చైతన్య, ఈశ్వరి, కృష్ణమూర్తి, తూకివాకం ఎంపీటీసీ ఆనందరావు పార్టీ నాయకులు రమేష్ రాయల్ సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణాధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నగేషం బాధిత కుటుంబానికి ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు అందించారు. దాతలకు రుణపడి ఉంటామని బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ప్రపంచ సోషల్ వర్క్‌డే ప్రారంభం



విజేతలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఎస్వియు: ప్రపంచ సోషల్ వర్క్‌డేను స్థానియ ఎస్వియూనివర్సిటీలో విభాగ అధిపతి ప్రొఫెసర్ టి చంద్రశేఖరయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని పాపులేషన్ స్టడీస్, సోషల్ వర్క్ విభాగంలో వరల్డ్ సోషల్ వర్క్ దినోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి పద్మనాభం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పనిచేస్తూ సమాజానికి ఎంతో కొంత సేవ చేయాలని మనిషికి మనిషి తోడుగా ఉండాలని మానవ సంబంధాలను పెంపొందించుకోవాలని సూచించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను, జీవన విధానం, అలవాట్లు, సమాజసేవ ప్రాముఖ్యత గురించి వివరించారు. తర్వాత సోషల్ వర్క్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సాయి సుజాత ప్రపంచ సోషల్ వర్క్ దినోత్సవం ప్రాముఖ్యత, ప్రస్తుత ప్రపంచంలోని సామాజిక సమస్యలు కారణాలు, వాటిని తొలగించు కునేందు కు జాగ్రత్తలు, సోషల్ వర్క్ విద్యార్థుల పాత్రను వివరించారు. టాటా ట్రస్ట్ స్వీకార్ తిరుపతి ప్రోగ్రాం మేనేజర్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్‌కు సంబంధించిన అంశాల గురించి వివరించారు. అనంతరం వక్తృత్వ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వియు క్యాంపస్ స్కూల్ విద్యార్థులు, ఎస్వియు ఐఏఎస్ఈ విద్యార్థులు, పాపులేషన్ స్టడీస్, సోషల్ వర్క్ విద్యార్థులు, డిపార్టుమెంటు అకడమిక్ కన్సల్టెంట్స్ కేవీ సునీల్ కుమార్, ఎం రీనా గెస్ట్ ఫ్యాకల్టీ డి కోదండరామిరెడ్డి, పార్థసారథి, శివప్ప, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బొల్లినేని జన్మదిన వేడుకలు



బొల్లినేని జగన్నాథంనాయుడుని అభినందిస్తున్న అభిమానులు

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని రాచగున్నేరి పంచాయతీ మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకులు, జెకె స్టీల్స్ అధినేత బొల్లినేని జగన్నాథం నాయుడు జన్మదిన వేడుకలు మంగళవారం ఆయన స్వగృహంలో అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అభిమా నులు మాట్లాడుతూ ఆకలితో వున్న వారికి ఆకలి తీర్చడంలోనూ, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ఆయన ముందుంటారన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని జెకే స్టీల్స్ దుకాణం ప్రాంగణంలో రెండు సంవత్సరాలుగా ఎలాంటి ప్రయోజనం ఆశించకుండా నిస్వార్థంగా ప్రతిరోజూ సుమారు 400 నుంచి 500 మంది నిరుపేద కుటుంబాలకు ఆకలి తీరుస్తున్నారని ఆయన మంచితనాన్ని ఇట్టే అర్థం చేసుకోవచ్చున్నారు. మండలంలో ఎలాంటి దేవ స్థానం నిర్మాణానికైనా ఆర్థిక సాయం కోరితే వారికి సిమెం టు బస్తాలు, ఐరన్ వంటివి అంద జేస్తారని పేర్కొ న్నారు. ముఖ్యంగా నియోజక వర్గంలో ఏ నిరుపేద కుటుంబం లో ఎవరో చనిపో యారని ఆయన కు తెలిస్తే ఆ కుటుంబాన్ని పరామర్శించి వారికి ఆర్థిక సహాయం చేసే మంచి మనసున్న వ్యక్తి అని తెలిపారు. ఇలాంటి గొప్ప వ్యక్తి జన్మదిన వేడుకలు ఎన్నో మరెన్నో జరుపుకోవాలని గ్రామ ప్రజలు, ఆయన అభిమానులు కోరుతున్నారు.

సిఆర్ఎస్ హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ నరసింహ నిశాంత్

ప్రజాశక్తి- రేణిగుంట: సిఆర్ఎస్ సబ్ డివిజనల్ రైల్వే హాస్పిటల్ సీనియర్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ నరసింహ నిశాంత్ బాధ్యతలు చేపట్టారు. మంగళవారం బాధ్యతలు చేపట్టిన డాక్టర్ నరహరి నిశాంత్‌ను రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు శాలువాతో సన్మానించి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరహరి నిషాత్ మాట్లాడుతూ పెన్షన్స్ కు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. తనను రైల్వే పెన్షన్స్ అసోసియేషన్ నాయకులు సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ప్రెసిడెంట్ రేణిగుంట సెక్రటరీ జయంత్ కుమార్, చైర్మన్ ఎస్ అసన్ సాహెబ్, ఆర్ కోదండ రామయ్య, వైస్ చైర్మన్లు బి రాజేంద్రన్, రవీంద్రబాబు, యస్. కె .మునీర్ బాషా, డివిజనల్ సబ్ ట్రెజరర్ ఆర్ ఎస్ జ్ఞాన శేఖర్, తిమ్మా రెడ్డి , షరీఫ్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి: ప్రిన్సిపల్



ఉత్తమ విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తల్లిదండ్రులు వారివారి పిల్లల పట్ల అప్రమత్తంగా వుండాలని, అప్పుడే వారు జాగ్రత్తగా వుంటా రని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో అధునాతన సౌకర్యాలను విద్యార్థులు చక్కగా వినియోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలంటే నేటి రోజుల్లో తల్లిదండ్రులు ప్రోత్సాహం , తోడ్పాటు అత్యవసర మన్నారు. పెరిగిన సాంకేతికత విద్యార్థుల పాలిట శాపం కాకూడదని విద్యార్థులు ప్రతి కదలికను తల్లిదండ్రులు దృష్టిలో వుంచుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం డిగ్రీ రెండవ, మూడో సంవత్సరంలో అధిక మార్కులు సాధించిన 13 మంది విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రుల సమావేశంలో వారికి బహుమతులు అందించారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకులు నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇతర అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


షణ్ముగరెడ్డిపై దాడి అమానుషం: శ్రీనివాసులు యాదవ్

పజాశక్తి-తిరుపతి(మంగళం): చిత్తూరు జిల్లా పార్లమెంటు టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముఖ రెడ్డిపై పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ ఆనంగి హరి, అతని అనుచరుడు సునీల్ అకారణంగా దాడి చేశారని టిడిపి రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎన్. శ్రీనివాసులు యాదవ్ అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో వారు మాట్లాడుతూ షణ్ముగ రెడ్డి పై దాడి అమానుషమన్నారు. తుడా నిధులతో పుత్తూరు పట్టణ సమీపంలోని చింతలకుంట వద్ద పార్కు నిర్మాణ పనులు జరుగుతున్నాయని, నిర్మాణ పనులలో తీసిన గోతిలో కుక్కపిల్ల పడిపోవడంతో దాన్ని బయటకు తీసే ప్రయత్నం చేస్తున్నాడని గమనించిన పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ హరి, అతని అనుచరులు ఉద్దేశపూర్వకంగా ఫొటోలు తీస్తున్నాడని నేపం వేసి భౌతిక దాడి చేశారన్నారు. అధికారం ఉందని ప్రవర్తిస్తున్న వైసిపి మూకలకు కాలం చెల్లిందని, రాబోయే కూటమి ప్రభుత్వంతో వీరి ఆటలు కట్టిస్తామన్నారు. బీసీలందరం టిడిపి వైపు ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆరూరు శ్రీనివాసులు, ముంతాజ్ బేగం, చంద్రగిరి బీసీ సెల్ అధ్యక్షులు సుబ్బు యాదవ్, హేమలత, తిరుమల నగర్ పంచాయతీ అధ్యక్షుడు గోవిందరాజులు, వెంకట సుబ్బమ్మ, వాణి గౌడ్, మునిరత్నం పాల్గొన్నారు.

పదవులిస్తే సామాజిక న్యాయం కాదు: శంకర్ రావు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పదవులు ఇస్తేనే సామాజిక న్యాయం వచ్చినట్లు కాదని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్ రావు అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో సామాజిక న్యాయమే లక్ష్యంగా స్వతంత్రులుగా 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీసీ, ఎస్సీ, ఎస్టి, మైనారిటీ వర్గాలకు చెందిన వారికి మద్దతుగా నిలవాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం నిర్ణయించిం దన్నారు. సామాజిక న్యాయమే లక్ష్యంగా రాయలసీమ ప్రాంతంలో పర్యటన ముగించుకొని మిగిలిన జిల్లాల్లో ప్రజలను చైతన్య పరచడానికి కార్యచరణ చేశామన్నారు. బీసీలను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా మాత్రమే పరిగణించడం దుర్మార్గమన్నారు. ప్రస్తుతం రాజకీయ పార్టీలు ప్రకటించిన బీసీ సామాజిక వర్గానికి చెందిన వారందరూ సంపన్నులని, ప్రజల నుంచి వచ్చిన పేద బీసీ నాయకులకు సీట్లు ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. కోట్లు పెట్టి సీట్లు కొనుక్కున్నవారు ఆ పార్టీలకు చట్టసభల్లో మాట్లాడుతున్నారే తప్ప బీసీల గురించి మాట్లాడటం లేదన్నారు. బీసీల పరిస్థితి పై బీపీ మండల్ ఇచ్చిన నివేదికను ఎవరు అమలు చేయడం లేదన్నారు. దేశ ప్రధాని మహిళా బిల్లు ప్రవేశపెట్టారని అందులో ఓబీసీ మహిళా వాటా కోసం నేటికీ పోరాడుతున్నామన్నారు. ఓబీసీలకు కుల గణాంకాలు జరపాలని, అప్పుడే సంపూర్ణత వస్తుందన్నారు. చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించే బీసీ నాయకులు ప్రజాసంఘాల బలోపేతానికి ఏనాడు తోడ్పాటును అందించడం లేదన్నారు. ఈ సమావేశంలో తిరుపతి, చిత్తూరు జిల్లాల ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్ ఆచారి, గణేష్, వినోద్ గౌడ్, మధు ఆచారి, మహేష్ యాదవ్, సుబ్రహ్మణ్యం, ద్వారక శ్రీను పాల్గొన్నారు.

భద్రత వైఫల్యంపై చర్యలు తీసుకోవాలి: మాజీ ఎమ్మెల్యే



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఈనెల 17వ తేదీ చిలకలూరిపేట వద్ద నిర్వహించిన ప్రజాగళంలో ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొన్న బహిరంగ సభలో పోలీసులు సక్రమంగా విధులు నిర్వహించలేదని ఎలక్షన్ కమిషన్ విచారణ జరిపించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని గూడూరు నియోజకవర్గ టిడిపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. గూడూరు టిడిపి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ చిలకలూరిపేట వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, చంద్రబాబు నాయు డు, పవన్ కళ్యాణ్ పాల్గొన్న బహిరంగ సభలో పోలీసు లు విధులు సక్రమం గా నిర్వహించలేదని అక్కడక్కడా ట్రాఫిక్ జామ్ అయిందన్నారు. అధికార పార్టీకి మద్దతుగా పోలీసుల విధులు నిర్వహించడం సరికాదన్నారు. ఎలక్షన్ కమిషన్ విచారణ జరిపి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రైం న్యూస్

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. గూడూరు మండల పరిధిలోని గ్రామీణ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు.. మండలంలోని ఈదలపల్లికి చెందిన ఇనుకుర్తి సుబ్బయ్య(35) ఆర్థిక ఇబ్బందులు కారణంగా పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లడంతో కుటుంబ సభ్యులు ఆయనను మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ప్రైవేట్ హాస్పిటలకు తరలించారని, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

583 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి -తడ: రేషన్ బియ్యాన్ని విజిలెన్సు అధికారులు పట్టుకున్న సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. తడ మండల పరిధిలోని అక్కంపేట గ్రామంలో 583 బస్తాల రేషన్ బియ్యంను విజిలెన్స్ అధికారులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. అక్కంపేట వద్ద 583 బస్తాల రేషన్ బియ్యం లారీలో లోడ్ చేస్తుండగా సమాచారం అందుకున్న విజిలెన్స్ సిఐ చంద్ర శేఖర రావు లారీని, డ్రైవర్ ను అదుపులోకి తీసుకుని తడ పోలీసులకు అప్పగించారు. బియ్యం అసలు నిందితుడైన ప్రతాప్ నాయుడు పరారీలో వున్నాడు. త్వరలో అతడిని పట్టుకుంటామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. సిఐతో పాటు సి యస్ డీటి ఓబయ్య వున్నారు.

డివైడర్‌పై దూసుకెళ్లిన పాల ట్యాంకర్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : డివైడర్‌పైకి పాల ట్యాంకర్ దూసుకెళ్లిన సంఘటన స్థానిక కార్వేటినగరం రోడ్డు విష్ణుమహల్ థియేటర్ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం సంభవించకపోవడంతో ఊపిరి పీల్చు కున్నారు. స్థానికుల కథనం మేరకు.. ఓ యువకుడు సెల్ ఫోన్ లో మాట్లాడుతూ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా తప్పించబోయి పాల ట్యాంకర్ డివైడర్ పై దూసుకెళ్లిందని స్థానికులు తెలిపారు. డివైడర్ వద్ద సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మోహన్ బాబుకు సునీల్ శుభాకాంక్షలు



సునీల్ చక్రవర్తికి కేక్ తినిపిస్తున్న మోహన్ బాబు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రముఖ హీరో, పద్మశ్రీ మంచు మోహన్ బాబు పుట్టినరోజు సందర్భంగా మంచు యువ సేన రాష్ట్ర అధ్యక్షులు ముత్తంశెట్టి సునీల్ చక్రవర్తి మోహన్ బాబును కలిసి పుట్టిన రోజు శు భాకాంక్షలు తెలిపారు. విద్యానికేతన్ విద్యా సంస్థల్లో మోహన్ బాబు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ చక్రవర్తి, ఏర్పాటు చేసిన భారీ కేకును కట్ చేసి అభిమానులకు మోహన్ బాబు పంచిపెట్టారు. మంచు యువసేన ఆధ్వర్యంలో సునీల్ చక్రవర్తి నిర్వహిస్తున్న అనేక సేవా కార్యక్రమాలను మోహన్ బాబు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సెల్వ కుమార్, రమణ, మురళి, కృష్ణ, రాష్ట్ర నలుమూలల నుంచి భారీ సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం (చంద్రగిరి): సినీ నటుడు, మోహన్ బాబు విశ్వవిద్యాలయ ఛాన్సలర్ డాక్టర్ మంచు మోహన్ బాబు జన్మదిన సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు. మంగళవారం ఉదయం మోహన్ బాబు విశ్వవిద్యాలయంలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరం వద్ద చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డిలతో పాటు దుశ్శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేసి పుట్టినరోజు శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి మండల టిడిపి అధ్యక్షుడు వి సుబ్రహ్మణ్యం నాయుడు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు, సకోరి ధనంజయ రెడ్డి, హేమాంబరాధర్ నాయుడు పాల్గొన్నారు.

మద్యపాన నివారణపై ర్యాలీ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ పీజీ కళాశాలలోని సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ సోషల్ వర్క్ డే సందర్భంగా కుప్పం బాదూర్ గ్రామ ప్రజలకు మద్యపాన నివారణ అనే అంశం పై మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ టి. నారాయణమ్మ మాట్లాడుతూ విద్యార్థులు మద్యపాన నిషేధం పై గ్రామ ప్రజలకు ఆహ్వాన కల్పించాలని ర్యాలీ నిర్వహించడం ద్వారా ప్రజల్లో ఆహ్వానం కల్పించవచ్చున్నారు. గ్రామాలలో పౌష్టిక ఆహార లోపం పైహెచ్ఐవి ఎయిడ్స్ గృహహింస వంటి ఆరోగ్య అంశాల పైన కూడా అవగాహన కల్పించాలని సూచించారు.